క్లుప్తంగా

ఏపీపీటీఏ డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్) : స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ డైరీని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.బాలాజీరావు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఏపీపీటీఏ జిల్లా అధ్యక్షుడు డేవిడ్ చిన్నబాబు, ప్రధాన కార్యదర్శి మధుసూదనరావు, ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏబీవీపీ లాసెల్ కో-కన్వీనర్‌గా యశ్వంత్

నెల్లూరు (టౌన్) : విశాఖలో ఈనెల 26వ తేదీ వరకు జరిగిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభల్లో స్థానిక వీఆర్ లా కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న యశ్వంత్‌ను రాష్ట్ర లాసెల్ కో-కన్వీనర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ లా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు నివాళి



నెల్లూరురూరల్ : భారత్ గౌరవ్ దివస్‌లో భాగంగా నగరంలోని ముత్తుకూరు బస్టాండ్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు బీజేపీ నేతలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శిపారెడ్డి వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకాలు అని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి నరేష్, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల

నెల్లూరు(క్రైమ్): కల్లుగీత కులాలకు కేటాయించిన 18 మద్యం దుకాణాలకు సోమవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు వరకు జిల్లాలోని అన్ని ఎక్సైజ్ స్టేషన్లలో ఆఫ్‌లైన్, హైబ్రీడ్ ప్రక్రియల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆరో తేదీ దరఖాస్తుల పరిశీలన, ఏడో తేదీ జెడ్పీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు దుకాణాల కేటాయింపునకు సంబంధించి కలెక్టర్ సమక్షంలో లాటరీ నిర్వహిస్తారు.

డీకేడబ్ల్యూ, ఐటీఐలో జాబ్‌మేళా నేడు

నెల్లూరు (టౌన్) : స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, ఫ్లిప్‌కార్ట్, అపోలో ఫార్మసీ, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు తదితర కంపెనీలు హాజరు కానున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఎమ్‌ఫార్మసీ చదివిన వారు అర్హులన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ జెరాక్స్, రెజ్యూమ్‌లు తీసుకు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 86398 67407, 99888 53335 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

• స్థానిక వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో మంగళవారం ఉదయం 9 నుంచి జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీల్ ఇండియా లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్, భార్గవి ఆటో మొబైల్స్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. జాబ్‌మేళాకు ఎస్ఎస్‌సీ, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు జెరాక్స్, రెజ్యూమ్‌ను తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 94944 56326, 63015 29271 నంబర్లను సంప్రదించాలన్నారు.

కత్తితో బెదిరించి దోపిడీ

నెల్లూరు(క్రైమ్) : ఓ వ్యక్తిని ముగ్గురు కలిసి కత్తితో బెదిరించి ఉంగరం, నగదును దోచుకెళ్లిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పొట్టేపాళెంలో దినేష్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఆయన నెల్లూరు బృందావనంలోని ఓ ఆప్టికల్ షాపులో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 25న పని ఎక్కువగా ఉండటంతో అర్ధరాత్రి వరకు ఆయన షాపులోనే ఉండి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. ఇరుగాళమ్మ గుడి సమీపంలోకి వచ్చే సరికి ముగ్గురు వ్యక్తులు కత్తితో దినేష్‌కుమార్‌ను బెదిరించి అతని చేతికున్న ఉంగరం, జేబులో ఉన్న రూ.1,200ల నగదును దోచుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు ఆదివారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు ఒకరినొకరు పిలుచుకుండడాన్ని బట్టి వారి పేర్లు జగదీష్‌కుమార్, సమీర్, నవాజ్ అని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన ఎస్సై నిందితుల గుర్తింపునకు చర్యలు చేపట్టారు.

ఉద్యోగి మృతికి సంతాపం

నెల్లూరు(అర్బన్) : జిల్లా వైద్యారోగ్యశాఖలో డ్రైవర్‌గా చేస్తున్న రసూల్ అహ్మద్ గుండెపోటుతో ఆదివారం రాత్రి మరణించారు. దీంతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సోమవారం ఉదయం మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే ఏపీ హంస జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చేజర్ల సుధాకర్‌రావు, కమలేకిరణ్‌లు పరామర్శించారు.

సమస్యల నిలయం.. ఆర్టీసీ కాలనీ

- మట్టిరోడ్లే గతి
- సైడు కాలువల్లేక ఇబ్బందులు
- కనీస వసతుల్లేక అల్లాడుతున్న ప్రజలు

పేరుకే నగరంలో ఉన్నా అక్కడి పరిస్థితులు మారుమూల గ్రామం కంటే ఘోరంగా ఉంటాయి. ఒక్క సిమెంట్ రోడ్డు మినహా మిగతా వీధుల్లో మట్టి రోడ్లే దిక్కు. చినుకు పడితే చాలు బురదతో కూడిన రోడ్లలోనే ప్రయాణించాలి. ఇక్కడ సుమారు 20 వీధులుంటే దాదాపు అంతా ఇదే పరిస్థితి.



మురుగు కాలువలు లేని వీధి



అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డు

నెల్లూరు(అర్బన్) : నగరంలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరులో ఆర్టీసీ కాలనీ సమస్యల నిలయంగా మారింది. ఇక్కడి ఇళ్లలోని మురుగు బయటకు వెళ్లేందుకు సైడుకాలువలు లేవు. దీంతో మురుగంతా ఇళ్ల చుట్టూ చేరుతోంది. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దోమలపై దండయాత్ర అని ప్రకటించినప్పటికీ ఆర్టీసీ కాలనీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. అక్కడ దోమల నివారణకు ఫాగింగ్ జరగలేదు. నిలువ ఉన్న నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయలేదు. దోమ కాటుకు ప్రజలు డెంగీ, మలేరియా, చికెన్ గన్యా లాంటి వ్యాధుల బారిన పడుతున్నారు.

వెలగని వీధి దీపాలు

ఆర్టీసీ కాలనీలోని అయ్యప్పనాయుడు వీధితో పాటు పక్క వీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట చిమ్మ చీకటి ఉంటోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇక్కడ పలు దఫాలుగా చోరీలు కూడా జరిగాయి. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఖాళీ ప్లాట్లలో నీరు

వర్షాలకు, అలాగే ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు బయటకు పోయేందుకు మార్గం లేక పలు వీధుల్లోని ఖాళీ ప్లాట్లలో నీరు నిలిచిపోయింది. ఆ నీటిలో చెత్త కుళ్లిపోవడంతో దుర్గంధ భరితంగా మారాయి. మరోవైపు తరచూ విష సర్పాలు ఇళ్లలోనికి వస్తుండటతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని తమ ప్రాంతాల్లో నీరు బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీరు

వీధి దీపాలు లేక ఇబ్బందులు



తమ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితిని చక్కదిద్దలేదు. రాత్రిపూట తిరగాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీదిధీపాలు వెలిగేలా చూడాలి.

– డి.శ్రీనివాసులు, ఆర్టీసీ కాలనీ వాసీ, బుజబుజనెల్లూరు

కాలువలను ఏర్పాటు చేయాలి



పలు ప్రాంతాల్లో మురుగు కాలువలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మురుగు పోయే మార్గం లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దోమల వల్ల పలు జబ్బులు వస్తున్నాయి. అధికారులు స్పందించి అన్ని వీధుల్లో మురుగుకాలువలు ఏర్పాటు చేయాలి.

– మస్తానమ్మ, బుజబుజనెల్లూరు

డిప్యూటీ మేయర్ ఎంపికకు నోటిఫికేషన్

నెల్లూరు(బారకాసు) : రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో ఖాళీగా ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్‌ల ఎంపిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 30లోపు ఎన్నికల కోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. కాగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయర్ ఎంపికను వచ్చేనెల 3న ఎన్నిక నిర్వహించనున్నారు.

2న నగరంలో డాగ్ షో

నెల్లూరు(సెంట్రల్) : నెల్లూరు కెన్నల్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న నగరంలోని వీఆర్సీ మైదానంలో డాగ్ షోను నిర్వహించనున్నట్లు క్లబ్ సెక్రటరీ సురేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సిల్వర్ జూబ్లీ షో ఉదయం 9 నుంచి ప్రారంభమవుతుందని, దాదాపు 35 రకాల డాగ్‌లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

భద్రత కల్పించండి

నెల్లూరు(బారకాసు) : తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్పొరేషన్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం ఎన్ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో కమిషనర్ సూర్యతేజను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కమిషనర్ సీసీ ప్రవీణ్‌కుమార్‌తో మేయర్ భర్త జయవర్ధన్ ప్రవర్తించిన తీరును నిరసిస్తూ అందరూ నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగుల విధులకు ఆటంకం కలగకుండా భద్రతా చర్యలను చేపట్టాలని ఈ సందర్భంగా కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి శీనయ్య, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫ్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు చక్రపాణి, సభ్యులు కృష్ణకిశోర్, అజయ్, రవి, శరత్‌బాబు, రవీంద్ర, మాలకొండయ్య, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

సమస్యలను తెలియజేయండి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : కార్పొరేషన్ పరిధిలోని 54 డివిజన్లలో స్థానిక సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా తెలియజేసి పరిష్కారాలు పొందాలని కమిషనర్ సూర్యతేజ తెలిపారు. ఎన్ఎంసీ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో కమిషనర్ పాల్గొని, అర్జీదారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో స్థానికులు కూడా భాగస్వాములు అయితే పనులు మరింత పారదర్శకంగా పూర్తి చేయగలమన్నారు. స్పందనలో మొత్తం 71 ఫిర్యాదులు అందుకున్నామని, అందులో విభాగాల వారీగా ఇంజినీరింగ్ 25, హౌసింగ్ 26, టౌన్‌ప్లానింగ్ విభాగం 9, రెవెన్యూ విభాగం 3, ఆర్‌టీఐ విభాగం 3 పబ్లిక్ హెల్త్ విభాగం 4, ఆప్కాస్ విభాగం 1 చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అదనపు కమిషనర్ నందన్, ఎస్ఈ రామ్మోహన్‌రావు, సిటీప్లానర్ హిమబిందు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

ఎర్ర జెండాలన్నీ ఒక తాటిపైకి రావాలి



సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న తమ్మారెడ్డి భరద్వాజ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశవ్యాప్తంగా ఎర్ర జెండాల పార్టీలన్నీ ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సినీ నిర్మాత, దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల నేపథ్యంలో సోమవారం నగరంలోని ముత్తుకూరుగేట్ సెంటర్ వద్ద సింహపురి సాంస్కృతిక ఉత్సవాలను సీపీఎం, ప్రజానాట్యమండలి వారు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ ప్రజాపోరాటాలు, ప్రజల సమస్యలను పరిష్కరించటంలో కమ్యునిస్టు పార్టీలే ముందున్నాయన్నారు. వామపక్ష భావాలు ఉన్న పార్టీలు అన్నీ ఒకటి కావాల్సిన సమయం ఆసన్నమయ్యిందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు మోహన్‌రావు, వెంకటరామరాజు, శేషయ్య, పుల్లయ్య, విజయ్‌కుమార్, రెహానాబేగం, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టిడ్కో సముదాయాల్లో ఆకతాయిల వేధింపులు

• పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేయండి



నగర డీఎస్పీ పి.సింధుప్రియకు సమస్యను వివరిస్తున్న మహిళలు

నెల్లూరు(క్రైమ్) : రూరల్ మండలం అక్కచెరువుపాడులోని టిడ్కో గృహ సముదాయాల్లో ఆకతాయిల వేధింపులు, నేరాలు అధికంగా ఉన్నాయని, పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.జిలానిఖాన్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కో-కన్వీనర్ సోఫియా, స్థానికులు కోరారు. ఈ మేరకు ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు నగర డీఎస్పీ పి.సింధుప్రియకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆమె తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జిలానీ, సోఫియాలు మాట్లాడుతూ భగత్‌సింగ్‌కాలనీ, అక్కచెరువుపాడులోని టిడ్కో గృహాల్లో నిరుపేదలు అధిక శాతం ఉంటున్నారన్నారు. ప్రధానంగా అక్కచెరువుపాడు టిడ్కో గృహ సముదాయాల్లో పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఆకతాయిలు, అసాంఘిక శక్తుల చేష్టలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నేరాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై పలుమార్లు పోలీసు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున ఇళ్ల ముందు నిలిపిన నాలుగు ఆటోల్లోని బ్యాటరీలు, టైర్లు, వివిధ వస్తువులను దుండగులు దొంగలించారన్నారు. వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన కొరవడిందన్నారు. ఇప్పటికైనా పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏపీ మహిళా సమాఖ్య నేతలు పి.వనజమ్మ, సాయిలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత యోగా శిబిరం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న ఉచిత సమీకృత యోగా శిబిరం సోమవారం ముగిసింది. భారత స్వాభిమాన్, పతంజలి యోగా సమితి, యోగా మిత్ర మండలి జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమానికి పతంజలి యోగ్ పీఠ్ దక్షిణ భారత ఇన్‌చార్జి రిత్‌దేవ్ మహరాజ్ స్వామి హాజరై మాట్లాడారు. యోగా సాధన ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సమతుల్యతను అందించి జీవన వికాసానికి ఉపయుక్తమవుతుందని తెలిపారు. యోగాను ప్రతిఒక్కరు తమ జీవన విధానంగా ఆచరించాలన్నారు. పతంజలి యోగ్ పీఠ్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ యోగాచార్య, భారత్‌స్వాభిమాన్‌ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు బి.విజయకుమార్‌రెడ్డి, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, యోగాసన ఆర్ట్స్ టెక్నికల్ సెక్రటరీ అనిల్‌కుమార్, సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మావతి పాల్గొన్నారు.

షాపు ధ్వంసంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : షాపును ధ్వంసం చేసిన ఘటనలో నిందితులపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. సత్యనారాయణపురానికి చెందిన శివకుమార్ చిన్నబజారులో ఓ మహిళకు చెందిన టిఫిన్ షాపును ఏడాది లీజ్‌కు తీసుకున్నారు. రెండునెలల కిందట లీజ్ గడువు ముగిసింది. శివకుమార్ లీజ్ కొనసాగించామని షాపు యజమాని భర్త శేఖర్‌ను కోరాడు. ఈ నేపథ్యంలో ఈనెల 25వ తేదీ అర్ధరాత్రి శేఖర్, మరో వ్యక్తి షాపును ధ్వంసం చేసినట్లు బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డయల్ యువర్ డీఎంకు నాలుగు ఫిర్యాదులు

నెల్లూరు సిటీ : నగరంలోని ఆర్టీసీ కేంద్రంలో డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో మొత్తం నాలుగు ఫిర్యాదులు వచ్చాయి. నెల్లూరు నుంచి దగదర్తికి రెండు బస్సుల మధ్య కనీస వ్యత్యాసం గంట సమయం ఇవ్వాలని కోరారు. పొదలకూరు నుంచి ఉదయం 5 గంటలకు నెల్లూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. నెల్లూరు-పామూరు రూట్‌లోని బస్సులు వింజమూరులో టీ బ్రేక్ కింద అరగంట వృథా చేస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని డీఎం-1 మురళీకృష్ణ తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు) : బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 10వ డివిజన్‌లోని కోదండరామపురం, కృష్ణమందిరం, ఉస్మాన్‌సాహెబ్‌పేట, బ్రాహ్మణసేవాసమాజం, రామచంద్రాపురం, శివాలయం, బాబు గిరిజనకాలనీ ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. జనవాసాల మధ్య అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

నెల్లూరు(బారకాసు) : తాగునీటి కుళాయి పన్నుల వసూళ్ల లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి వందశాతం లక్ష్యాలను సాధించాలని అదనపు కమిషనర్ నందన్ ఆదేశించారు. ఎన్ఎంసీలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో పాటు సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.

హామీల అమలు ఏదీ?

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కూటమి నేతలు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రశ్నించారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

నెల్లూరు రైల్వే సీఐపై విచారణ?

- ఆయన అవినీతి ఆరోపణలపై సీఎం, రైల్వే ఎస్పీ, డీజీ వరకు ఫిర్యాదులు
- నేడో.. రేపో జిల్లాకు రానున్న రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఇద్దరు సిబ్బంది ఇటీవల గుంతకల్ డివిజన్ రైల్వే ఎస్పీ, సీఎం చంద్రబాబు, రైల్వే డీజీలకు ఫిర్యాదు చేయడం ఆ శాఖలో కలకలం రేకెత్తిస్తోంది. భుజంగరావు 2023 సెప్టెంబరులో సీఐగా బాధ్యతలు స్వీకరించారు. కొంతకాలంగా సీఐ వ్యవహార శైలిపై ఆ శాఖలోని కొందరు సిబ్బందే బహిరంగ విమర్శలు చేస్తున్నారు. సుమారు ఏడాది కిందట పడుగుపాడు-కొడవలూరు మధ్య రైలు పట్టాలపై ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆ కేసును పూర్తి స్థాయిలో విచారించకుండా నీరుగార్చారన్న ఆరోపణలున్నాయి. మరో ఘటనకు సంబంధించి సూళ్లూరుపేటలో ఓ వ్యక్తి పనులు చేస్తూ మృతి చెందగా సదరు కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలతోపాటు కొందరు అధికారులు, సిబ్బందికి మెమోలు ఇస్తూ కక్ష సాధింపు చర్యలకు గురి చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవే అంశాలపై ఇద్దరు సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై సీఐను వివరణ కోరగా అవన్నీ అవాస్తవాలని, విధులు సక్రమంగా నిర్వర్తించమన్నందుకే కొందరు పనిగట్టుకుని ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు.

విచారణకు ఎస్పీ రాక

నెల్లూరు రైల్వే సీఐపై వచ్చిన అవినీతి ఆరోపణలతోపాటు సిబ్బందిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని సీఎం, రైల్వే ఎస్పీ, డీజీ వరకు ఫిర్యాదులు వెళ్లిన నేపథ్యంలో స్వయంగా విచారించేందుకు గుంతకల్ డివిజన్ రైల్వే ఎస్పీ రాహుల్‌మీనా నెల్లూరుకు రానుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన మంగళవారం లేదా బుధవారం వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఎస్పీ వ్యక్తిగత పనుల నిమిత్తం వస్తున్నారని కొందరు సిబ్బంది పేర్కొంటున్నప్పటికీ విచారణ నిమిత్తమేనన్న ప్రచారం సాగుతోంది.

బయటపడిన అమ్మవారి విగ్రహం



పూజలు చేస్తున్న మహిళలు

నెల్లూరు సిటీ : రూరల్ పరిధిలోని ఆటోనగర్ వెనుకవైపు ఉండే బీఎంఆర్ నగర్ పదో వీధిలో ఆదివారం ఓ ప్రైవేటు స్థలంలో జేసీబీలతో మట్టి తవ్వకాలు చేస్తుండగా అమ్మవారి విగ్రహం బయటపడింది. అయితే సదరు యజమాని ఆ విగ్రహాన్ని ప్రభుత్వ స్థలంలో ఉంచారు. అయితే అది కమ్యునిటీ భవనం కోసం కేటాయించిన స్థలం కావడంతో ఓ వర్గం వారు అక్కడి నుంచి సమీపంలోని మరో స్థలానికి తరలించారు. అయితే స్థానికులు మాత్రం విగ్రహాన్ని ఇక్కడే ఉంచాలని తిరిగి ప్రభుత్వ స్థలంలో ఉంచారు. కాగా అమ్మవారి విగ్రహం వెలసిన చోటే ఆలయ నిర్మాణం చేపట్టాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఎంఆర్‌నగర్‌కు సోమవారం చేరుకున్న బీజేపీ నాయకులు ఆ విగ్రహానికి స్థానికులతో కలిసి పూజలు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు రంగప్రవేశం చేసి ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. కాగా సోమవారం సాయంత్రానికి స్థానికులతో కలిసి తాత్కాలిక షెడ్డును ఏర్పాటు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఇండోర్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఎంపికలు సోమవారం జరిగాయి. ఫిబ్రవరి 21 నుంచి విజయవాడలో జరిగే మాస్టర్ వెటరన్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి మెన్, ఉమెన్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్, ఉమెన్ సింగిల్స్ ఇలా మొత్తం 75 మంది అర్హత సాధించారని రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ వివరించారు. ఈ పోటీల్లో కోచ్ వెంకటేష్, సీనియర్ క్రీడాకారులు పర్యవేక్షించారు.

పెద్దాస్పత్రిలో అరుదైన ఆపరేషన్

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి)లో ఓ వ్యక్తికి అరుదైన సర్జరీ చేసి ఐదు కిలోల కణితిని తొలగించారు. దీనిపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాశేషాబాషా సోమవారం ఆస్పత్రిలో వివరించారు. నాయుడుపేటకు చెందిన 55 ఏళ్ల కిష్టయ్యకు మెడ వెనుక భాగంలో ఎడమ భుజానికి సమాంతరంగా కణితి ఏర్పడిందన్నారు. మెడ నుంచి వచ్చే రక్తనాళాలకు కణితి అంటుకుని ఉండడంతో పేద వాడైన కిష్టయ్య అనేక ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఆపరేషన్ చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రికి మూడు రోజుల క్రితం వచ్చారన్నారు. డాక్టర్ సుహాసిని, డాక్టర్ ఉమామహేష్, మత్తు వైద్యులు జగదీష్‌ల టీమ్‌తో కలిసి ఆపరేషన్ను విజయవంతం చేశామన్నారు. పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు.

హెల్మెట్ తప్పనిసరి

నెల్లూరు(క్రైమ్) : ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని నగర డీఎస్పీ పి.సింధుప్రియ సూచించారు. భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం నగర, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించేందుకు డీఎస్పీ కార్యాలయం నుంచి కేవీఆర్ పెట్రోల్‌బంకు వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఇందులో డీఎస్పీ సింధుప్రియ పాల్గొని, మాట్లాడారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చని సూచించారు. నగర ఇన్‌స్పెక్టర్‌లు కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, దశరథరామారావు, రోశయ్య, శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, సౌత్, నార్త్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటరెడ్డి, రామకృష్ణ, సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

100 మందికి జరిమానా

నెల్లూరు సిటీ : ముత్తుకూరు రోడ్డు ఆకుతోట హరిజనవాడ సమీపంలో రూరల్ ఎస్సై వేణు ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని, లైసెన్స్ లేని వంద మందికి జరిమానాలు విధించారు. ఎస్సైలు లక్ష్మణ్, ప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

చేతివృత్తులను కాపాడాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కార్పొరేట్ దెబ్బకు చేతి వృత్తులు కనుమరుగవుతున్నాయని, ప్రభుత్వాలు కాపాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఏపీ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చేతి వృత్తిదారులకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించాలని, 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వృత్తి సంఘాల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ వెంకటేశ్వర్లు, గుంజి దయాకర్, పలు వృత్తి సంఘాల నాయకులు పాల్గొన్నారు.